సాక్షి హైదరాబాద్

సోమవారం ꠰ 30 ꠰ సెప్టెంబర్ ꠰ 2024



బ్లూ బగ్ మాయ!

సైబర్ నేరగాళ్లు కొత్త దారులు వెతుకుతున్నారు. బ్లూ టూత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో.. దీన్నే అస్త్రంగా మలుచుకుంటున్నారు. బ్లూ బగ్గింగ్ పేరిట హ్యాకింగ్‌కు పాల్పడుతున్నారు. -8లో



నిర్వాసితులకు 'డబుల్' టెన్షన్!

మూసీ నిర్వాసితులకు 'డబుల్' టెన్షన్ పట్టుకుంది. వారికి కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/23.0

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళ కొన్ని ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన గాలులతో.. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది.

పేదల ఇళ్లను కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?

కేంద్రమంత్రి బండి సంజయ్



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న బండి సంజయ్, డాక్టర్ లక్ష్మణ్ తదితరులు

కాచిగూడ: మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లు అన్యాయంగా కూల్చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. హైడ్రా దాడులపై ప్రభుత్వం పునః సమీక్షించుకోకుంటే బీజేపీ పోరాడేందుకు సిద్ధంగా ఉందని ఆయన హెచ్చరించారు. ప్రధాని మోదీ 74వ జన్మదినం సందర్భంగా ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సేవా మహాయజ్ఞం పేరుతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుండాలే.. పేదల ఇండ్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యామా, పేదల ఉసురు తీసుకోవడమే ఇందిరమ్మ రాజ్యమా' అని ప్రశ్నించారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా మోసం చేయడమే ఇందిరమ్మ రాజ్యామా, పేదలు కన్నీళ్లు పెడుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కన్పించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, మనోహర్ రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి, కె.గీతామూర్తి తదితరులు పాల్గొన్నారు.

శరీరాన్ని నడిపే ఇంజిన్ 'హృదయం'



వాక్‌లో పాల్గొన్న చాప్టర్ ప్రతినిధులు, డాక్టర్లు తదితరులు

సాక్షి, సిటీబ్యూరో/కవాడిగూడ: శరీరాన్ని నడిపించే ఇంజిన్ 'హృదయం' అని కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ అమన్ సాల్వాన్ పేర్కొన్నారు. ది కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఇందిరా పార్కులో ఆదివారం వరల్డ్ హార్ట్ డే వాక్ నిర్వహించారు. ఈ వాక్‌ను సొసైటీ గౌరవ కార్యదర్శి డాక్టర్ కృష్ణ మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. వాక్‌లో కార్డియాలజిస్టులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. హృదయ సంబంధ వ్యాధులు గుండె, రక్త నాళాలను చాలా అంశాలు ప్రభావితం చేస్తాయని డాక్టర్ అమన్ చెప్పారు. గుండె భాగానికి రక్తసరఫరాలో అంతరాయం కలిగినా, తగ్గినా గుండెపోటు వస్తుందని వివరించారు. గుండె కణజాలం ఆక్సిజన్, పోషకాలను పొందలేకపోతే శరీర అవసరాలను తీర్చడానికి తగినంత రక్తాన్ని పంప్ చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది గుండెపోటు, అధిక రక్తపోటుకు దారి తీస్తుందని పేర్కొన్నారు. మంచి అలవాట్లు, పోషకాహారం, జీవనశైలితో గుండె పోటును నివారించాలన్నారు.

వచ్చే ఏడాది గోల్ఫ్ టోర్నమెంట్ నిర్వహిస్తాం


- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ టోర్నమెంట్ విజేతగా శంకర్‌దాస్



విజేత శంకర్‌దాస్‌కు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గోల్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వచ్చే సంవత్సరం జనవరి, ఫిబ్రవరిలో గోల్ఫ్ టోర్నమెంట్ నిర్వహిస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గోల్కొండ నయాఖిల్లాలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో జరిగిన 'గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ టోర్నమెంట్' ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన శంకర్‌దాస్‌కు మంత్రి ట్రోఫీతో పాటు రూ.15 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో గోల్ఫ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నో ప్రణాళికలు రూపొందించారన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం ఆధ్వర్యంలో వచ్చే సంవత్సరం భారీ స్థాయిలో గోల్ఫ్ టోర్నమెంట్ నిర్వహించనున్నామని తెలిపారు. అంతేకాకుండా నేరుగా ప్రభుత్వమే గోల్ఫ్ కోర్సును సిద్ధం చేసేందుకు ప్రణాళికలు రూపొందించిందన్నారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న గోల్కొండ మాస్టర్స్ ట్రోఫీకి అపూర్వ స్పందన లభించిందని ఆయన అన్నారు. ఇలాంటి టోర్నమెంట్ల నిర్వహణ వల్ల తెలంగాణలో పర్యాటక రంగానికి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. గోల్కొండ మాస్టర్ టోర్నీకి తొమ్మిది దేశాలకు చెందిన 15 మంది క్రీడాకారులు రావడం గొప్పవిషయమన్నారు. టోర్నమెంట్ రన్నరప్‌గా నిలిచిన అంగద్‌చీమా ట్రోఫీతో పాటు రూ.10 లక్షల బహుమతిని సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బీవీకే రాజు, పీజీటీఐ సీఈవో ఉత్తమ్‌సింగ్ పాల్గొన్నారు.

'లోపలి వాన' పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి కె.వంశీధర్ రచించిన 'లోపలి వాన' పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య ఎన్.గోపి మాట్లాడుతూ..మనిషి అంతర్ముఖంలోని జడివాన వంటి అంశాలపై రచయిత రాసిన తీరు బాగుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓయూ తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, ఆచార్య సూర్యధనుంజయ్, సికింద్రాబాద్ పీజీ కళాశాల తెలుగు అధ్యాపకులు ఆదినారాయణ, కిన్నెర కార్యదర్శి రఘురామ్ పాల్గొన్నారు.





ఉత్సాహంగా పింక్ రన్

రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన పింక్ పవర్ రన్‌కు విశేష ఆదరణ లభించింది. ఎంఈఐఎల్, సుధారెడ్డి ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. పది, ఐదు, మూడు కిలోమీటర్ల కేటగిరీల్లో మారథాన్లను నిర్వహించారు. గచ్చిబౌలిలో ప్రారంభమైన మారథాన్లు ఐఎస్‌బీ, విప్రో కూడలి మీదుగా తిరిగి స్టేడియంకు చేరుకున్నాయి. పురుషుల విభాగంలో విజేతగా లవ్ ప్రీత్ నిలిచారు. మహిళల విభాగంలో సీమా, సంజీవని ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నారు. పింక్ రన్‌లో పాల్గొన్న వేలాది మంది ప్రత్యేకమైన గులాబీ రంగు దుస్తులను ధరించి పక్షి రూపంలో భారీ మానవ హారంగా ఏర్పడి గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ప్రయత్నం చేశారు.

– సాక్షి, సిటీబ్యూరో

'మురుగు' పరుగెత్తొద్దు!

సీవరేజీ ఓవర్ ఫ్లో అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

"వందశాతం మురుగు శుద్ధి దిశగా అడుగులు వేస్తున్న జలమండలి తాజాగా మహానగరాన్ని 'సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ'గా మార్చేందుకు సిద్ధమైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షకు అనుగుణంగా గాంధీ జయంతి నుంచి స్పెషల్ డ్రైవ్ అమలుకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. భారీ వర్షాలకే కాకుండా నిత్యం డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల ద్వారా ఓవర్ ఫ్లోను సైతం పూర్తి స్థాయిలో నివారించేందుకు ప్రణాళికతో ముందడుగు వేస్తోంది. రెండురోజుల క్రితం స్పెషల్ డ్రైవ్ కార్యాచరణ ప్రణాళిక అమలుపై వర్క్‌షాపు నిర్వహించి సీజీఎంల నుంచి మేనేజర్ల స్థాయి వరకు దిశానిర్దేశం చేసింది."

–సాక్షి, సిటీబ్యూరో

- అక్టోబర్ 2 నుంచి మూడు నెలల పాటు స్పెషల్ డ్రైవ్
- ప్రతి నిత్యం పైప్‌లైన్ల క్లీనింగ్‌కు చర్యలు
- రంగంలోకి ఎయిర్ టెక్ మిషన్లతో ప్రత్యేక బృందాలు
- పొంగిపొర్లే డ్రైనేజీ లైన్లపై ప్రత్యేక దృష్టి
- మురుగు సమస్య 30 శాతానికి తగ్గింపే లక్ష్యం

ప్రతినిత్యం రోడ్లపై మ్యాన్‌హోళ్ల నుంచి సీవరేజీ ఓవర్ ఫ్లో సమస్యను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి తీవ్రంగా పరిగణించారు. రోజువారీగా సీవరేజీ సమస్యపై వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు.

- ఎప్పటికప్పుడు తాత్కాలికంగా సీవరేజీ ఓవర్ ఫ్లో సమస్య పరిష్కరించడం కంటే పూర్తి స్థాయిలో శాశ్వతంగా పరిష్కారం చూపాలని యోచించారు. అందుకు సాధ్యాసాధ్యాలపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు.
- ప్రధానంగా డ్రైనేజీ పైప్‌లైన్లలో పూడిక పేరుకుపోవడం, ఎప్పటికప్పుడు తొలగింపులో నిర్లక్ష్యం, ఏళ్ల నాటి భూగర్భ పైప్‌లైన్లు దెబ్బతినడం, సామర్థ్యాన్ని మించి కనెక్షన్లు ఉండటం, మురుగులో వ్యర్థాలు అధికంగా రావడం, పైప్‌లైన్లు జామ్ కావడం, మ్యాన్‌హోల్స్ మూతలు దెబ్బతిని ఉండటం లాంటి అంశాలు సీవరేజీ ఓవర్ ఫ్లో సమస్యకు ప్రధాన కారణాలుగా గుర్తించారు.
- సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణతో చర్యలకు ఉపక్రమించారు.

మూడు నెలల్లో 30 శాతానికి తగ్గేలా..

నగరంలోని ప్రధాన, అంతర్గత రోడ్లపై నిత్యం మురుగు పరుగుల కట్టడికి మూడు నెలల పాటు స్పెషల్‌డ్రైవ్ కొనసాగనుంది. అక్టోబర్ నుంచి డిసెంబర్ చివరి నాటికి డ్రైనేజీ ద్వారా సీవరేజీ ఓవర్ ఫ్లో సమస్యను 30 శాతానికి తగ్గించే విధంగా ప్రత్యేక కార్యాచరణ అమలు కానుంది. ఆ తర్వాత నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని జలమండలి నిర్ణయించింది.. గత రెండు సంవత్సరాల ఫిర్యాదులను పరిశీలిస్తే.. నెలకు దాదాపు 40 వేల వరకు సీవరేజీ సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు గుర్తించింది. రెండేళ్లలో డ్రైనేజీ మ్యాన్ హోళ్ల ద్వారా సీవరేజి ఓవర్ ఫ్లో పై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా మొదటి మూడు నెలలు వాటిపై ప్రత్యేక దృష్టి సారించనుంది.



ఎయిర్‌టెక్ యంత్రం ద్వారా సీవరేజీ తొలగింపు (ఫైల్)

కార్యాచరణ ఇలా..

జలమండలి పరిధిలోని సెక్షన్ల వారీగా భూగర్భ పైప్‌లైన్ల పరిస్థితి, సామర్థ్యాన్ని ప్రత్యేక బృందం పరిశీలిస్తాయి. పైప్‌లైన్ల సామర్థ్యం తక్కువ ఉన్నా..కాలం చెల్లిన పైప్‌లైన్లు ఉన్నా వాటి స్థానంలో కొత్త పైప్‌లైన్లను ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాధనలు సిద్ధం చేస్తారు. పైప్‌లైన్ల వారీగా కనెక్షన్ల సంఖ్య, సామర్థ్యం, వాటి ద్వారా వచ్చే వ్యర్థాలను గుర్తిస్తారు. క్షేత్ర స్థాయి సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలపై మేనేజర్ స్థాయి పర్యవేక్షణ ఉంటుంది. ప్రతి సర్కిల్‌కు డైరెక్టర్ స్థాయి అధికారి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు.

మా లక్ష్యం.. సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ

రాబోయే రెండేళ్లలో సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా హైదరాబాద్‌కు గుర్తింపు తీసుకురావాలన్నది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన. అందులో భాగంగా మొదటి మూడు నెలల్లో సీవరేజీ ఓవర్ ఫ్లో సమస్యలను 30 శాతానికి తగ్గించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నాం. ఇందుకు క్షేత్ర స్థాయిలో అవసరమైన సిబ్బంది, ఎయిర్ టెక్ మిషన్లను అందుబాటులో ఉంచుతాం. నగరవాసులు కూడా డ్రైనేజీలో నీటిలో కరగని వ్యర్థాలు వేయొద్దు. ఓవర్ ఫ్లోను నివారించేందుకు సహకరించాలి.

– అశోక్ రెడ్డి, ఎండీ, జలమండలి



జలమండలి పరిధిలో సీవరేజీ వ్యవస్థ ఇలా..

కోర్‌సిటీలో పైప్‌లైన్	5,570 కి.మీ
జీహెచ్‌ఎంసీ పరిధిలోపైప్‌లైన్	4,199 కి.మీ
ట్రంక్ లైన్	612 కి.మీ
మ్యాన్‌హోళ్లు(కోర్‌సిటీ)	2,70,679
మ్యాన్‌హోళ్లు(శివార్లలో)	3,60,700
పారిశుద్య సిబ్బంది	1327
జెట్టింగ్,ఎయిర్ టెక్ మిషన్లు	212

ప్రతినిత్యం ఇలా..

ప్రతినిత్యం సెక్షన్ల వారీగా సీవరేజీ జెట్టింగ్, ఎయిర్ టెక్, సిల్ట్ మిషన్లతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఫిర్యాదులతో సంబంధం లేకుండా పైప్‌లైన్ల క్లీనింగ్ పనులు చేపట్టనున్నాయి. క్షేత్ర స్థాయి పనితీరుపై జీపీఎస్ ట్రాకింగ్‌ను డాష్‌బోర్డుకు అనుసంధానం చేసి ఉన్నతస్థాయిలో పర్యవేక్షిస్తారు. ఏ సెక్షన్లో..ఎక్కడ..ఎంత..ఏ వర్క్ జరిగింది అనే అంశాలను గుర్తించి రోజువారీ వర్క్ రిపోర్ట్ రూపొందించనున్నారు. క్షేత్ర స్థాయి పనితీరుపై ప్రతి వారం డివిజన్ స్థాయిలో, పక్షం రోజులకు ఒకసారి సర్కిల్ స్థాయిలో, నెలకోసారి ఎండీ స్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించి చర్యలు చేపడతారు.

మూసీ నిర్వాసితులను వీడని దడ!



- మార్కింగ్ ఆగినా.. వెంటాడుతున్న హైడ్రా భయం
- కదలమంటున్న కుటుంబాలు
- అండగా ఉంటామంటున్న రాజకీయ పక్షాలు
- కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న బాధితులు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరీవాహకం పరిధిలోని నివాసితులకు 'ఇళ్ల కూల్చివేత' దడ పట్టుకుంది. ప్రస్తుతానికి ఇళ్లకు రెడ్ మార్కింగ్ ప్రక్రియ నిలిచిపోయినా..ఏక్షణంలో హైడ్రా బుల్డోజర్లు విరుచుకు పడ్తాయో అని భయాందోళనకు గురవుతున్నారు. నదీ గర్భంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న కుటుంబాల్లో కొందరు ఇళ్లను ఖాళీ చేసి పునరావాసం కోసం తరలిపోతుండగా, మిగతా కుటుంబాలు కదిలేందుకు ససేమిరా అంటున్నాయి. మూసీ బాధితులకు మద్దతుగా బీఆర్ఎస్, బీజేపీ పక్షాలు, ప్రజాసంఘాలు ముందుకు వస్తునా..మూసీ ప్రక్షాళనలో భాగంగా కూల్చివేతలు ఖాయమన్న సంకేతాలు వస్తుండడంతో ఆశలు వదలుకునే పరిస్థితులు ఏర్పడింది. బాధిత కుటుంబాల్లో కొందరు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతుండగా, సరైన పత్రాలు లేని కుటుంబాలు మాత్రం దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాయి. కాగా ఆదివారం మూసీ పరీవాహక పరిధిలో ఎలాంటి హడావుడి కన్పించలేదు.

గృహాలతోపాటు కుటీర పరిశ్రమలు

మూసీ పరీవాహక పరిధిలో గృహాలతోపాటు కుటీర పరిశ్రమలు కూడా అధికంగానే ఉన్నాయి. నదీ గర్భం, బఫర్‌జోన్‌లో కలిపి మొత్తం 12 వేల పైచిలుకు గృహాలు ఉన్నట్లు అధికార యంత్రాంగం వెల్లడిస్తున్నా..వాటి సంఖ్య రెట్టింపు కంటే అధిక సంఖ్యలో ఉన్నట్లు అనధికార అంచనా. గృహాలతో పాటు కుటీర పరిశ్రమలు కూడా పెద్ద ఎత్తున ఉన్నాయి. వాటిపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కూల్చివేతతో వందలాది మంది ఉపాధి కోల్పోతారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

పునరావాసం టార్గెట్ 2,166 కుటుంబాలు

మూసీ పరీవాహక పరిధిలోని నదీగర్భంలో గుర్తించిన 2166 కటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 1595, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో 239, రంగారెడ్డి జిల్లా పరిధిలో 332 కుటుంబాలను మాత్రమే డ్రోన్ సర్వే ద్వారా గుర్తించారు. ఈ సర్వే గతంలో జరిగింది. తాజాగా మరోసారి సర్వే పేరుతో యాప్‌లో వివరాల ఆధారంగా రెండు రోజుల్లో కేవలం 916 గృహాలకు మాత్రమే రెడ్ మార్కింగ్ వేశారు. నివాసితుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవడంతో తాత్కాలికంగా రెడ్ మార్కింగ్ నిలిచిపోయింది. అయితే ఇప్పటి వరకు మార్కింగ్ వేసిన గృహాలకు సంబంధించి కుటుంబాలలో సానుకూలత వ్యక్తం చేసినవారిలో సైతం సగం కుటుంబాలకు మాత్రమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించి తరలించినట్లు తెలుస్తోంది. అయితే జీహెచ్‌ఎంసీ పరిధిలోని 14 డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల్లో మొత్తం మీద ఖాళీగా ఉన్న గృహాలు ఐదు వందలు కూడా లేనట్లు తెలుస్తోంది. మిగితా వారికి పునరావాసంపై ఎలా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఆలస్యం చేస్తే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా దక్కవన్న ఆందోళన నిర్వాసితులను వెంటాడుతోంది.

నగరానికి నలువైపులా మెట్రో..

- రెండో దశతో విస్తరించనున్న మెట్రో రైలు సేవలు
- ఫ్యూచర్‌సిటీకి మహర్దశ
- నగర శివార్ల వరకు మెట్రో పరుగులు..

సాక్షి, సిటీబ్యూరో: రెండో దశ ప్రాజెక్టుతో నగరం నలువైపులా మెట్రో సేవలు విస్తరించనున్నాయి. ప్రస్తుతం నాగోల్ నుంచి రాయదుర్గం, ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు మూడు కారిడార్‌లలో మెట్రో రైళ్ల రాకపోకలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. రెండో దశలో కొత్తగా మరో ఆరు మార్గాల్లో మెట్రో విస్తరించనున్నారు. నగరంలోని ఎక్కడి నుంచైనా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకొనేవిధంగా ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన ఫోర్త్‌సిటీకి కూడా ఈ రెండో దశలోనే మెట్రో నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన తరువాత అనేక రకాల ఆకర్షణీయమైన ఫీచర్‌లతో ఫ్యూచర్‌సిటీ మెట్రో డీపీఆర్‌ను తయారు చేయనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మరోవైపు ఇటు మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు, అటు ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు, కొత్తగా పడమటి వైపు కోకాపేట్ నియోపోలిస్ వరకు మెట్రో విస్తరించనున్న దృష్ట్యా కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకొనే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఫోర్త్‌సిటీకి కూడా మెట్రో పరుగులు పెట్టే అవకాశం ఉన్న దృష్ట్యా దక్షిణ హైదరాబాద్ అభివృద్ధి చెందనుంది. ఇప్పటికే ఔటర్ రింగ్‌రోడ్డు వరకు జీహెచ్‌ఎంసీ పరిధిని విస్తరించిన సంగతి తెలిసిందే. మరోవైపు హెచ్‌ఎండీఏ పరిధిని కూడా ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ వరకు పొడిగించింది. దీంతో ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు పెద్ద ఎత్తున టౌన్‌షిప్పులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు ప్రజారవాణా, మౌలిక సదుపాయాలు సైతం విస్తరించనున్నాయి.



1.5 కి.మీకు ఒకటి..

రెండో దశ ప్రాజెక్టులో కొత్తగా 80కి పైగా మెట్రో స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. చాంద్రాయణగుట్ట వద్ద భారీ ఇంటర్‌ఛేంజ్ స్టేషన్‌ను నిర్మిస్తారు. వివిధ మార్గాల్లో వచ్చే రైళ్లు ఈ స్టేషన్ నుంచి మారే అవకాశం ఉంది. ప్రతి ఒక కిలోమీటర్‌కు, లేదా 1.5 కిలోమీటర్లకు ఒకటి చొప్పున అందుబాటులో ఉండేవిధంగా అన్ని రూట్‌లలో పెద్ద సంఖ్యలో స్టేషన్లను నిర్మిస్తారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ రూపొందిస్తున్న కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లానింగ్ ప్రకారం స్టేషన్‌లను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు ఇప్పుడున్న మూడు కారిడార్‌ల నుంచి కూడా ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు, ఫోర్త్‌సిటీ, పటాన్‌చెరు, హయత్‌నగర్ తదితర అన్ని వైపులకు ప్రయాణించేవిధంగా మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు ఎయిర్‌పోర్టు వద్ద కొత్తగా ప్రతిపాదించిన 1.6 కిలోమీటర్ల భూగర్భ మెట్రో మార్గంలోనే మెట్రో స్టేషన్ కూడా రానుండడం మరో ప్రత్యేకత.

పెరిగిన రూట్...

రెండో దశ మెట్రో ప్రాజెక్టును మొదట 72 కిలోమీటర్ల వరకు నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందించారు. కానీ రెండు, మూడు దఫాలుగా ప్రాజెక్టును వివిధ మార్గాల్లో పొడిగించారు. దీంతో ప్రస్తుతం ఇది 116.2 కిలోమీటర్లతో అతి పెద్ద ప్రాజెక్టుగా అవతరించింది. గతంలో మైలార్‌దేవ్ పల్లి నుంచి పీ–7 రోడ్డు మార్గంలో ఎయిర్ పోర్టు వరకు ప్రతిపాదించిన రూట్‌ను తాజాగా మార్చారు. ఆరాంఘర్ నుంచి కొత్త హైకోర్టు మీదుగా మళ్లించారు. అలాగే రాయదుర్గం నుంచి అమెరికన్ కాన్సులేట్ వరకు మొదట ప్రతిపాదించిన రూట్‌ను సైతం ఇప్పుడు కోకాపేట్ నియోపోలిస్ వరకు పొడిగించడంతో రెండో దశ రూట్ కిలోమీటర్లు పెరిగాయి. కొత్తగా ఎయిర్ పోర్టు నుంచి ఫోర్త్‌సిటీ వరకు 40 కిలోమీటర్‌ల మార్గాన్ని కూడా ఈ రెండో దశలోనే ప్రతిపాదించడం గమనార్హం. అలాగే ఓల్డ్ సిటీ రూట్‌లో మొదట ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ప్రతిపాదించగా దాన్ని ప్రస్తుతం చాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు. ఇలా అన్ని వైపులా అదనంగా పొడిగించడంతో రెండో దశ పరిధి బాగా విస్తరించింది.

ఓనం ఉత్సవాల్లో పాల్గొన్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



ఘనంగా ఓనం ఉత్సవాలు

శేరిలింగంపల్లి: మలయాళీ అసోసియేషన్ ఆఫ్ నల్లగండ్ల, శేరిలింగంపల్లి ఆధ్వర్యంలో ఓనం ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. నల్లగండ్ల హుడా కాలనీలోని వికాస్ ఎఫిస్టిమో గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో 20 గేటెడ్ కమ్యూనిటీలకు చెందిన 800 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక హైదరాబాద్ నగరం అన్నారు. ఇక్కడ ప్రతి ఒక్కరూ తమ సంస్కృతి సంప్రదాయాలను ఘనంగా జరుపుకుంటారన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా భేషజాలకు పోకుండా ప్రతి ఒక్కరినీ కడుపున పెట్టుకుని చూసుకుంటుందన్నారు. ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని గుర్తు చేశారు. మలయాళీ అసోసియేషన్ ఆఫ్ నల్లగండ్ల, శేరిలింగంపల్లి ఆధ్వర్యంలో గోషయాత్ర, స్థానిక క్రీడలతో కూడిన ఓనంకలి, అరిటాకులతో నిర్వహించే సద్య, మలయాళీల సాంస్కృతిక నృత్యం కథాకళి వేడుకలకు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అన్విత గ్రూప్ సీఎండీ అచ్యుత రావు బొప్పన, అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీజిత్ నాయర్ తదితరులు పాల్గొన్నారు.



సీతక్కకు పూల మొక్క అందజేస్తున్న నిర్వాహకులు

ట్రాన్స్‌జెండర్లతో ముజ్రా పార్టీ

8 మంది యువకులు, నలుగురు ట్రాన్స్‌జెండర్ల అరెస్ట్

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్ జెండర్లతో కలిసి అర్ధనగ్న ప్రదర్శనలతో ముజ్రా పార్టీ నిర్వహిస్తున్న సెంటర్‌పై దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. మొత్తం 8 మంది యువకులతో పాటు నలుగురు ట్రాన్స్‌జెండర్లను అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బండ్లగూడ ప్రాంతానికి చెందిన హమీద్ అనే వ్యక్తి శనివారం రాత్రి స్థానిక యువకులు, ట్రాన్స్ జెండర్లతో కలిసి గౌస్‌నగర్ ఉందాసాగర్ చెరువు పక్కన లేక్ వ్యూ హిల్స్‌లోని ఓ ప్రహరీలో గుట్టు చప్పుడు కాకుండా ముజ్రా పార్టీని ఏర్పాటు చేశాడు. అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ జాఫ్రీ, మహ్మద్ రియాజ్, షేక్ సొహేల్, షానవాజ్ ఖాన్, మహ్మద్ ఇమ్రాన్, మహ్మద్ ఫెరోజ్, సయ్యద్ షా ఫారూఖ్, షేక్ మహ్మద్‌లు ట్రాన్స్‌జెండర్లు మైలార్‌దేవ్‌పల్లికి చెందిన సొహేల్ అలియాస్ ఆర్యా, పురానాపూల్‌కు చెందిన మహ్మద్ సైఫ్ అలియాస్ లవ్లీ, జల్‌పల్లికి చెందిన కరీమా బక్ష, వట్టేపల్లికి చెందిన అబ్దుల్ ఆమెర్‌లతో అర్ధనగ్నంగా డ్యాన్స్‌లు చేయిస్తూ భారీ శబ్దాలతక్ష స్థానికంగా న్యూసెన్స్‌కు పాల్పడ్డారు. దీనిపై సమాచారం అందడంతో దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ కె. సత్యనారాయణ, ఎస్సైలు నవీన్, నర్సింహులు దాడులు నిర్వహించి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడు పరారీలో ఉన్నాడు. వారి నుంచి ఒక ఆంప్లిఫయర్, స్పీకర్ బాక్స్ లను స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులకు చిక్కిన యువకులు, ట్రాన్స్‌జెండర్లు

నిర్వాసితులకు 'డబుల్' టెన్షన్!

- అసంపూర్తిగా భవనాలు..
- డ్రైనేజీలైన్లు, కరెంట్, మంచినీరు కరువే
- మౌలిక వసతుల్లేక.. ఉండలేక పోతున్న లబ్ధిదారులు
- అసంపూర్తిగా మిగిలిన ఇళ్లను తీసుకునేందుకు నిరాకరిస్తున్న మూసీ నిర్వాసితులు



రావిర్యాల గ్రామంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం గృహ సముదాయం

సాక్షి, సిటీబ్యూరో: మూసీ నిర్వాసితులకు 'డబుల్' టెన్షన్ పట్టుకుంది. ప్రభుత్వ అధికారులు ఇప్పటికే సర్వే పేరుతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నదీగర్భం సహా బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలసిన అక్రమ నిర్మాణాలను గుర్తించి, వాటికి రెడ్ మార్క్ వేస్తూ ఇళ్లను ఉన్న ఫళంగా..ఖాళీ చేసి వెళ్లాల్సిందిగా హుకుం జారీ చేస్తుండటం, బాధితులకు అసంపూర్తిగా మిగిలిన ఇళ్లను కేటాయిస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే లాటరీ ద్వారా డబుల్ బెడ్ రూమ్‌లను పొందిన నిరుపేద లబ్ధిదారులు.. మౌలిక సదుపాయాల లేమితో అక్కడ ఉండలేక ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఒక్కో బ్లాకులో పది పదిహేను మందికి మించి ఉండటం లేదు. తట్టి అన్నారం, వనస్థలిపురం, కుర్మల్‌గూడ లో ఇదే పరిస్థితి. తాజాగా మూసీ నిర్వాసితులకు ఈ ఇళ్లను కేటాయిస్తుండటంతో వారు వీటిని తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. కనీస వసతులు లేని చోట తాము ఎలా ఉండగలమని వారు ప్రశ్నిస్తున్నారు. ఉన్న ఇళ్లను ఖాళీ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పుతున్నారు.

అసంపూర్తిగా భవనాలు

బండరావిరాలలో పది బ్లాకులు నిర్మించారు. స్లాబు, బ్రిక్ వర్క్ మాత్రమే పూర్తయ్యాయి. గదులకు డోర్లు బిగించ లేదు. దర్వాజలు, కిటికీలు ధ్వంసమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబు నుంచి నీరు లీకవుతుంది. గోడలకు నిమ్ము చ్చింది. నిర్మాణాల చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. డ్రైనేజీ, కరెంట్, మంచినీరు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు మృగమే. ఇక బాచారంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల దాదాపు పూర్తి కావొచ్చాయి. రంగులు కూడా వేశారు. డోర్లు, కిటికీలు బిగించారు. విద్యుత్ లైటింగ్, ప్లంబింగ్ వర్క్స్ పూర్తి చేయాల్సి ఉంది. వనస్థలిపురం, తట్టి అన్నారంలో నిర్మించిన ఇళ్లలో ఇప్పటికే సగానికిపైగా పంపిణీ చేసినప్పటికీ మౌలిక సదుపాయాలు లేక మెజార్టీ లబ్ధిదారులు వాటిని ఖాళీ చేసి వెళ్లారు. లిఫ్టులు లేకపోవడంతో పై అంతస్తుల్లోకి చేరుకునేందుకు వృద్ధులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. బాటసింగారంలో స్లాబ్ వర్క్ మాత్రమే పూర్తి చేశారు. డ్రైనేజీ, కరెంట్, మంచి నీరు, రో డ్లు, ఇతర మౌలిక సదుపాయాలు లేక పోవడం ఇబ్బందిగా మారింది. వీటిని మూసీ నిర్వాసితులకు కేటాయించనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. కనీస వసతులు కూడా లేని ఈ ఇళ్లను తీసుకునేందుకు వారు వెనుకాడుతున్నారు. నందనవనంలో నిర్మించిన ఇళ్లలో ఆక్రమణ దారులు తిష్టవేశారు. వీరిని ఖాళీ చేయించి, అర్హులకు కేటాయించడంలో అధికారులు ఘోరంగా విఫలం అవుతున్నారు. మూసీ నిర్వాసితులకు ఇక్కడ ఇళ్లు కేటాయిస్తే..ఆక్ర మణ దారుల నుంచి నిర్వాసితులకు చుక్కెదురవనుంది.

నిరాకరిస్తున్న నిర్వాసితులు

మూసీ పరివాహక ప్రాంతంలో 12 వేలకుపైగా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించింది. వీటిలో నది గర్భంలో హైదరాబాద్ జిల్లా పరిధిలో 1595, రంగారెడ్డిలో 332, మేడ్చల్ పరిధిలో 239 నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పోలీసు, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులతో కూడిన బృందాలు గత రెండు రోజులుగా మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి, ఆయా నిర్మాణాలకు రెడ్‌మార్క్ వేస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ నివాసం ఉండటం శ్రేయస్కరం కాదని పేర్కొంటూ నిర్వాసితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. నిర్వాసితులకు ఓఆర్‌ఆర్‌కు అటు ఇటుగా ఉన్న 15 వేలకుపైగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయిస్తున్న విషయం తెలిసిందే. అయితే అక్కడ కనీస మౌలిక సదుపాయాలు లేక పోవడంతో వాటిని తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో సుమారు లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించి, ఆ మేరకు ఇప్పటికే కొన్ని చోట్ల పూర్తి చేసింది. అయినా మెజార్టీ బ్లాకులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వీటి పూర్తికి అవసరమైన నిధులు కేటాయించక పోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

పంచారు..సౌకర్యాలు విస్మరించారు!

కీసర: నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లిలో జీ+10 విధానంలో 6240,, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలో సుమారు 6200 ఇళ్లు నిర్మించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు లబ్ధిదారులకు కేటాయించారు. కానీ పెండింగ్‌లో ఉన్న పనులు ఇప్పటికీ పూర్తి చేయలేదు. గృహాలు పొందిన లబ్ధిదారులు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే సగానికిపైగా ఖాళీ చేసి వెళ్లారు. రవాణా, మంచినీరు, పాఠశాల, ఆసుపత్రి, లేకపోవడంతో ఇక్కడ ఉండలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 200 కుటుంబాలే ఉంటున్నాయి. రాంపల్లిలో లిఫ్టులు ఏర్పాటు చేసినప్పటికీ..ఇప్పటికీ దాన్ని ప్రారంభించలేదు. జీ+10 అంతస్తుల భవనాన్ని ఎక్కి దిగలేక వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం గృహ సముదాయాలో విద్యుత్ కనెక్షన్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

కోర్టు వద్దని చెప్పినా కూల్చేశారు..

పంజగుట్ట: కొందరు రెవెన్యూ అధికారులు తమపై కక్షకట్టి హైడ్రా పరిధిలో లేకున్నా అమీన్పూర్, కృష్ణారెడ్డిపేటలో తమ మూడు భవంతులను కూల్చివేసి తమను రోడ్డుపాలు చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానం కూల్చివేతలు చేపట్టరాదని ఆదేశించినా వాటిని పట్టించుకోకుండా తమ భవనాలను కూల్చివేశారని ఆరోపించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు డాక్టర్ మహ్మద్ రఫీ, పొదలకూరి కల్యాణ్, మధుసూదన్ మాట్లాడుతూ .. అమీన్పూర్ మండలం, కృష్ణారెడ్డిపేటలో సర్వేనెంబర్ 165, 166లో తాము ప్లాట్‌లు కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు సమయంలో 1986 నుంచి లింక్ డాక్యుమెంట్లను పరిశీలించి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని ఎల్‌ఆర్‌ఎస్ కూడా ఉందని, అన్ని అనుమతులతో ప్రభుత్వానికి చలాన్లు కట్టి మరీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. కాగా ప్లాట్ నెంబర్ 92లో 270 గజాల స్థలంలో నాలుగు అంతస్తుల్లో కిడ్స్ కేర్ చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మించినట్లు మహ్మద్ రఫీ తెలిపాడు. ప్లాట్ నెంబర్ 90లో కల్యాణ్ 300 గజాల స్థలంలో అన్ని అనుమతులతో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టానన్నారు. ప్లాట్ నెంబర్ 74లో మధుసూదన్ 284 గజాల స్థలంలో ఐదు అంతస్తుల నిర్మించాడన్నారు. కాగా తమ స్థలాలు సర్వేనెంబర్ 165, 166లో ఉన్నప్పటికీ ఇది సర్వే నెబర్ 164గా పేర్కొంటూ అందులో ప్రభుత్వానికి చెందిన 44 ఎకరాల స్థలం ఉండాలని చెబుతూ శనివారం సాయంత్రం నోటీసులు ఇచ్చి ఆదివారం ఉదయం కూల్చివేతలు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఉన్నతాధికారులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సదరు కట్టడాలు అక్రమమని, వాటికి పర్మిషన్ లేదని, అక్కడ ఆసుపత్రి లేదని, ఇంకా భవనం నిర్మాణ దశలోనే ఉందని వక్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి సర్వే చేపట్టకుండానే తమ స్థలం 164 సర్వే నెంబర్‌లో ఉందని ఎలా నిర్ధారించారని ప్రశ్నించారు. తమకు రిజిస్ట్రేషన్ చేసిన ప్రభుత్వమే,తమ నిర్మాణాలు కూల్చివేసి రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము నిర్మాణాలు చేస్తున్నప్పుడు కూడా రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ నోటీసులు ఇచ్చారని తాము హైకోర్టుకు అన్ని ఆధారాలతో సంప్రదించగా కోర్టు రెవెన్యూ అధికారులకు సదరు స్థలాల జోలికి వెళ్లరాదని ఉత్తర్వులు ఇచ్చిందని అయినా తమ నిర్మాణాలు కూల్చివేస్తే కోర్టు ధిక్కరణ కేసు వేసినట్లు తెలిపారు. దీంతో తమపై కక్ష పెంచుకున్న రెవెన్యూ అధికారులు హైడ్రాను సంప్రదించి వారి సాయంతో నిర్మాణాలు కూల్చివేశారని తెలిపారు. తాము తిరిగి న్యాయస్థానాన్ని ఆశ్రయించామని బాధితులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తిరిగి సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని కోరారు.



కాలనీ లేఔట్ చూపిస్తున్న బాధితులు ..

ప్రేమతో వైద్యం చేయాలి

సినీనటుడు బ్రహ్మానందం



బంజారాహిల్స్: మనిషిని భయం కృంగదీస్తుందని, అలాంటి సమయంలోనే వైద్యులు ప్రేమతో రోగికి ధైర్యం చెప్పి వైద్యం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని సినీ నటుడు పద్మశ్రీ బ్రహ్మానందం అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో స్టార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా హార్ట్ టూ హార్ట్ పేరుతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మానందం తన జీవితంలో తన కుటుంబం విషయంలో ఎదురైన ఆరోగ్య అనుభవాలను, డాక్టర్లతో జరిగిన అనుభవాలను పంచుకున్నారు. తాను కూడా బైపాస్ సర్జరీ చేసుకున్నానని కానీ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. జబ్బు రాక ముందే జాగ్రత్తగా పడాలని ఒక వేళ వస్తే దానిని అధిగమించే మార్గాలను అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ ఎండీ డాక్టర్ మన్నెం గోపీచంద్, సంస్థ జేఎండీ డాక్టర్ రమేష్ గూడపాటి తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ఉమేష్ మృతదేహం

చాదర్‌ఘాట్: రాంగ్ రూట్‌లో వచ్చిన నర్సింగ్ కాలేజీ బస్సు ఢీ కొని బైక్‌పై వెళుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డబీర్‌పురా కోమటివాడకు చెందిన దాసకొండ ఉమేష్ (35) వ్యాపారం చేసేవాడు. ఆదివారం ఉదయం తను దిల్‌సుఖ్‌నగర్ నుంచి చాదర్‌ఘాట్ వెళుతుండగా రాంగ్ రూట్‌లో వచ్చి యశోధా నర్సింగ్ స్కూల్ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఉమేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడిగా కే.ఎస్.రామారావు



ఫిలింనగర్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ) అధ్యక్షుడిగా ప్రముఖ నిర్మాత కే.ఎస్.రామారావు ఘన విజయం సాధించారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేసిన కే.ఎస్.రామారావు 795 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా ఎస్ఎన్.రెడ్డి, జనరల్‌సెక్రటరీగా తుమ్మల రంగారావు (ఏకగ్రీవ ఎన్నిక), జాయింట్‌సెక్రటరీగా సదాశివరెడ్డి (ఏకగ్రీవ ఎన్నిక), కోశాధికారిగా జె. శైలజ, పర్మనెంట్ మెంబర్లుగా కె. భవానీ, కృష్ణంరాజు(వేణు), ఏడిద సతీష్(రాజా), సిహెచ్. వర ప్రసాదరావు ఎన్నికయ్యారు. ప్రమోటి కమిటీ మెంబర్లుగా కాజా సూర్యనారాయణ, భాస్కర్‌నాయుడు, కె.మురళీ మోహన్‌రావు, నవకాంత్, బాలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 1950 ఓట్లకుగాను 1097 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుడిగా పోటీ చేసిన కె.ఎస్.రామారావుకు 946 ఓట్లు రాగా, ఆయనపై పోటీ చేసిన డాక్టర్ జ్యోతిప్రసాద్ కోసరాజుకు 151 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షుడిగా గెలిచిన ఎస్.ఎన్‌రెడ్డికి 696 ఓట్లు, కోశాధికారిగా గెలిచిన జులాల శైలజకు 631 ఓట్లు వచ్చాయి.

మట్టి దిబ్బలు పడి యువకుడి మృతి

మూసా పేట: కేబుల్ వైరింగ్ కోసం తీసిన గుంతలో పని చేస్తుండగా మట్టి మీద పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లిలోని రంగనాయక స్వామి ఆలయ సమీపంలో హానర్ సంస్థ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బీహార్‌కు చెందిన రవి (20) తండ్రి కిషోర్ రామ్‌తో కలిసి కూలీ పనులు చేస్తున్నాడు. కేబుల్ వైరింగ్ కోసం తీసిన గుంతలో వైర్ల సమస్య ఉండటంతో రవి గుంతలోకి దిగి వాటిని మరమ్మతు చేస్తుండగా ఒక్కసారిగా మట్టి కుప్పకూలి అతడిపై పడింది. దీంతో అక్కడే ఉన్న తోటి కార్మికులు అతడిని బయటికి తీసి సమీపంలోని అమోర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి కిషోర్ రామ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య

- స్నేహితుడే గొంతుకోసి హతమార్చినట్లు అనుమానం
- పోలీసుల అదుపులో నిందితుడు?

చిక్కడపల్లి: స్నేహితుడిని ఓ వ్యక్తి గొంతుకోసి హత్య చేసిన సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం... లోయర్ ట్యాంక్‌బండ్ గోశాల వెనక గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైనట్లు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడిని భరత్ నగర్‌కు చెందిన మహ్మద్ బషీర్(30)గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కూలీగా పనిచేస్తున్న బషీర్ కుటుంబ సభ్యులు కొంతకాలం క్రితంతుముకుంట కొకూర్‌కు మకాం మార్చారు. అయితే ఉంటున్న బషీర్, తన స్నేహితుడు భోలక్‌పూర్‌కు చెందిన పైయిమొద్దీన్‌తో కలిసి ఇక్కడే ఉంటున్నాడు. శనివారం రాత్రి ఇద్దరూ కలిసి మద్యం తాగిన అనంతరం గోశాల ప్రాంతానికి వచ్చారు. వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పైయిన్ బషీర్‌ను చాకుతో గొంతు కోసి హత్య చేసి అక్కడినుంచి పరారయ్యాడు. సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్‌యాదవ్, దోమలగూడ ఏసీపీ మొగలయ్య, క్లూస్ టీమ్ సిబ్బంది ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

బ్లూబగ్ మాయ!

- బ్లూ టూత్‌తో స్మార్ట్‌ఫోన్ల హ్యాకింగ్
- మాల్‌వేర్స్‌తో సెల్‌ఫోన్‌లోని డేటా తస్కరణ
- వీటి సహాయంతో సైబర్ నేరాలు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతున్నారు. బ్లూటూత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో దీన్నే అస్త్రంగా మలుచుకుంటున్నారు. బ్లూ బగ్గింగ్ పేరుతో కొత్త తరహా హ్యాకింగ్‌లకు పాల్పడుతూ మోసాలు చేస్తున్నారు. ఢిల్లీ, ఎన్సీఆర్, ముంబై వంటి ప్రధాన నగరాల్లో బ్లూటూత్ బగ్గింగ్ సైబర్ నేరాలు పెరిగిపోతుండటంతో తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే వ్యక్తిగత డేటాను తస్కరించి బెదిరింపులకు పాల్పడటంతో పాటూ బ్యాంకు ఖాతాలు లూటీ చేస్తారని హెచ్చరిస్తున్నారు.

ఏమిటీ బ్లూ బగ్?

తొలుత హ్యాకర్ తన బ్లూ టూత్ పేరును ఎదుటి వ్యక్తులు వినియోగిస్తున్న ఫోన్, ఇతర గాడ్జెట్స్ కంపెనీ పేరులాగా మార్చి కనెక్ట్ అయ్యేందుకు బ్లూటూత్ రిక్వెస్ట్ పంపిస్తారు. అది మనదే అని పొరపాటున పెయిర్ యాక్సెప్ట్ చేస్తే ఇక అంతే... హ్యాకర్లు బ్రూట్‌ఫోర్స్ సాంకేతికత ద్వారా మన సెల్‌ఫోన్‌లోని లాగిన్ ఆధారాలు, ఎన్‌క్రిప్షన్ కీ, వెబ్‌పేజీలకు భంగం కలిగిస్తారు. దీంతో సెల్‌ఫోన్ ఆన్‌లోనే ఉంటుంది కానీ, ఎలాంటి సందేశాలు రావు. ఆ తర్వాత సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకునేందుకు మాల్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేస్తాడు. అంతే దీంతో మీ ఫోన్‌లోని కాంటాక్ట్‌లు, మెసేజ్‌లు, ఫొటోలు, ఆడియో, వీడియో రికార్డ్‌లు, ఈ-మెయిల్స్ ప్రతీ ఒక్కటీ నేరస్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది.

పెయిర్ చేస్తే దొరికిపోయినట్టే..

సాధారణంగా హ్యాకర్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్‌ల ద్వారా లింకులు, సాఫ్ట్‌వేర్‌లు పంపించి హ్యాక్ చేస్తుంటారు. బ్లూ బగ్గింగ్ విధానంలో మాత్రం బ్లూటూత్‌ను అనుసంధానిస్తే చాలు హ్యాకింగ్ చేయవచ్చు. యునీక్ నంబర్, అడ్రస్‌లతో రూపొందించిన మీడియా యాక్సెస్ కంట్రోల్ (ఎంఏసీ) బ్లూటూత్ నెట్‌వర్క్‌లో ఒకదానితో ఒకటి అనుసంధానించడానికి వీలు కల్పిస్తుంది. ఒకసారి పెయిర్ అయితే అవతలి వ్యక్తి ఎలక్ట్రానిక్ ఉపకరణాన్ని ట్రాక్ చేయడానికి వీలుంటుంది. సెల్‌ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారాన్ని నేరస్తులు తస్కరించి, వీటి సహాయంతో బెదిరింపులకు పాల్పడుతుంటారు. బలవంతపు వసూళ్లు చేస్తుంటారు.

ప్రతి ఒక్కటీ బ్లూటూత్‌తో కనెక్ట్..

ఈ రోజుల్లో ప్రతి ఒక్క ఎలక్ట్రానిక్ ఉపకరణం బ్లూటూత్‌తో అనుసంధానమైపోయింది. ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్, స్మార్ట్‌ఫోన్, స్మార్ట్‌వాచ్‌లు, ఎయిర్‌బడ్స్, కారులోని మ్యూజిక్ సిస్టమ్ (కార్ ప్యూటర్), ఇంటిలోని ఫ్రిడ్జ్, ఏసీ, టీవీ వంటి గృహోపకరణాలు సైతం బ్లూటూత్‌తో కనెక్ట్ అవుతున్నాయి. బ్లూటూత్‌తో అనుసంధానమైతే ఆయా ఉపకరణాలను చేతులతో కాకుండా మౌఖిక ఆదేశాలతో వినియోగించుకునే వీలుంటుంది. దీంతో వేగం, సౌలభ్యంగా ఉంటుంది. ఈ కారణంగా యువత నుంచి పెద్దల వరకు ఈ వైర్‌లెస్ పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఇదే అదునుగా సైబర్ నేరగాళ్లు బ్లూటూత్ అనుసంధానమై ఉన్న ఎలక్ట్రానిక్ ఉపకరణాలను లక్ష్యంగా చేసుకొని పంజా విసురుతున్నారు.